క్లుప్తంగా

డీఎల్‌పీవో ఆకస్మిక పర్యటన



పారిశుధ్య పనులపై ఆరా తీస్తున్న డీఎల్‌పీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో సోమవారం మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారాణి ఆకస్మికంగా పర్యటన చేపట్టారు. పంచాయతీలోని రికార్డులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు రికార్డుల నమోదు విధిగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటా చెత్త సేకరణ, పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉద్యోగులకు సన్మానం



శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డీఈవో

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్, మామిడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజిరెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని ఆయా పాఠశాలల్లో సన్మానించారు. కార్యక్రమాల్లో డీఈవో యాదయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రావు సేవలు మరువలేనివి



ప్రకాష్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

నెన్నెల: ప్రధానోపాధ్యాయుడిగా దండనాయకుల ప్రకాష్‌రావు నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాలకు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కొనియాడారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవీ విరమణ సన్మాన, ఆత్మీయ సభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, మ ల్లాగౌడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు రారు... ఫిర్యాదులు స్వీకరించరు

కోటపల్లి: మండలకేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే ప్రభుత్వ అధికారిక కార్యక్రమం ప్రజావాణికి డుమ్మా కొట్టడంతో ఇక ఫిర్యాదుదారులు ఎలా వచ్చి తమ బాధలను ఎవరికి చెప్పుకుంటారని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారుల హాజరుకావాల్సి ఉండగా, కేవలం ఎంపీడీవో మాత్రమే హాజరై ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అధికారుల నిర్లక్ష్యంతో, ప్రజావాణి కార్యక్రమం తూతూమంత్రంగా జరుగుతుంది. అధికారులు స్పందించి ప్రతీ సోమవారం మండలకేంద్రంలో జరిగే ప్రజావాణికి అధికారులు హాజరయ్యేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వందపీట్ల రోడ్‌లో సమీపంలో కోర్టు వివాదంలో ఉన్న ఉమ్మర్‌మియా కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థలంలోని రేకుల షెడ్లు, ప్రహరీ కూల్చివేతలపై చిపెల్లి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎండీ మీనాజోద్దిన్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపారు.

రోడ్డు వేశారు.. నీరు పోయడం మరిచారు



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో సిమెంట్ రోడ్డు కొద్ది భాగాన్ని కాంట్రాక్టర్ ఐదు రోజుల క్రితం వేసి, నీరు పోయకుండానే వెళ్లిపోయాడు. వర్షం పడితే నీరు ఆగేందుకు చిన్నపాటి సిమెంట్ రోడ్డుకు ఇసుకను కట్టలుగా పోశాడు. సిమెంట్ రోడ్డు వేసిన తరువాత కనీసం 20రోజుల పాటు నీరు ప్రతిరోజు పోయాల్సి ఉన్నా, వర్షం పడితే ఆ నీరే సిమెంట్ రోడ్డుకు సరిపోతుందని అనుకొని అలాగే వదిలేశారు. నాణ్యత లోపించి, వేసిన చిన్నపాటి రోడ్డు కంకర తేలి పాడవుతుందని, వేసింది సగమే రోడ్డు, దానిని కూడా నిర్లక్ష్యంగా వదిలేయడంపై కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆపదలో మేమున్నామంటూ..!

- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న రక్తదాతలు

మంచిర్యాలటౌన్: 'అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న', 'రక్తదానం.. మహాదానం' అంటూ ఎన్ని ప్రచారాలు చేసినా, స్పందన మాత్రం కొందరిలోనే. రక్తదానం చేయాలని ఉన్నా, కొన్ని అపోహలు, మనకెందుకులే అనే భావనతో చాలా మంది రక్తదానం చేసేందుకు అంతగా ఇష్టం చూపరు. ఇప్పటికే అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడం లేదు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మేమున్నాం అంటూ, కొందరు రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేయడంతో పాటు, పలు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. అపాయంలో ఉన్నవారికి రక్తం అందించి, వారి కుటుంబాలకు భరోసా ఇస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

స్వచ్ఛంద రక్తదాతల కోసమే

భారతీయ వైద్యుడు డాక్టర్ జైగోపాల్ జాలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ చండీఘడ్‌లో ప్రొఫెసర్‌గా చేశారు. అతను రక్తమార్పిడి రంగంలో నిపుణుడిగా పేరుగాంచి, మన దేశంలో రక్తమార్పిడి వైద్యంలో తండ్రిగా పరిగణించబడ్డారు. రక్తం కావాలంటే, ఖచ్చితంగా ఆరోగ్యంగా ఉన్న మనిషి మాత్రమే రక్తదానం చేయాలనే ఉద్దేశ్యంతో 1975 నుంచి అక్టోబర్ 1వ తేదీన రక్తదాన దినోత్సవాన్ని పాటిస్తూ, ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించడంతో, కాలానుక్రమంగా ఏటా అక్టోబర్ 1వ తేదీని జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవంగా నిర్వహించి, స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారిని సన్మానించి, ప్రాముఖ్యతను కల్పిస్తున్నారు. రక్తదాతలు చెప్పేది ఒక్కటే, అపోహలు వద్దు.. రక్తదానం చేద్దాం.. మరో ప్రాణాన్ని కాపాడుదాం అంటూ ముందుకు వెళుతున్నారు.



స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న దాతలు(ఫైల్)

రక్తదానం కోసం ఎక్కడికైనా వెళ్తా..



నా స్నేహితునికి తలసేమియా వ్యాధి ఉన్నదని తెలిసి, కాలేజీ చదువుతున్న రోజులోనే రక్తదానం చేయడాన్ని ప్రారంభించాను. ప్రస్తుతం నా వయస్సు 28సంవత్సరాలు, ఇప్పటికీ 25సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్నారని అత్యవసర సమయంలో రక్తం అవసరముందని ఎక్కడి నుంచి ఫోన్ వచ్చినా ఆ ప్రాంతానికి వెళ్లి రక్తదానం చేస్తాను. రక్తదానం వల్ల తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులతో పాటు, అత్యవసరమైన వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కందుకూరి అనుదీప్, మందమర్రి

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సాధారణ నిధులు రూ.60.90లక్షల ద్వారా వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులను చేసేందుకు అంచనా వ్యయంకు పరిపాలనా ఆమోదంను తెలిపారు. 14వ ఆర్థిక సంఘం 2016–17, 2017–18 మిగులు నిధులు రూ.4కోట్లతో అభివృద్ధి పనులను చేసేందుకు గాను ఆమోదం తెలుపగా, మంచిర్యాల పట్టణంలోని వివిధ రకాల కేసుల పరిష్కారం కోసం లీగల్ ఫీజు రూ.3.65లక్షలను చెల్లించేందుకు ఆమోదించారు. మంచిర్యాల పట్టణాన్ని డ్రోన్ ద్వారా క్షుణ్ణంగా సర్వే చేసేందుకు సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ వారి సహకారంతో సవరించబడిన మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు కౌన్సిల్ ఆమోదాన్ని తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎండి మసూద్ అలీ, టౌన్‌ప్లానింగ్ అధికారి బి.సంపత్, రెవెన్యూ ఆఫీసర్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ టి.ఉదయ్‌కిరణ్‌లు పాల్గొన్నారు.

వ్యాపారులకు లక్కీ డ్రా ద్వారా స్టాల్ అలాట్‌మెంట్



లక్కీ డ్రా తీస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌లో నిర్మించిన స్టాళ్ల అలాట్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇదివరకు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో స్టాల్ నిర్వహణ కోసం మున్సిపాలిటీకి 78మంది డిపాజిట్ రుసుము చెల్లించారు. వీరికి మార్కెట్లో ఉన్న స్టాల్‌ను లక్కీ డ్రా ద్వారా కేటాయించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు సంయుక్తంగా లక్కీ డ్రా తీసి స్టాల్‌ను కట్టబెట్టారు. ఈ మేరకు స్టాల్ అలాట్‌మెంట్ అయిన లబ్ధిదారుల పేర్ల జాబితాను మార్కెట్ నోటీసు బోర్డుపై అంటించారు. సదరు లబ్ధిదారులు అక్టోబర్ 1వ తేదీ నుంచి మార్కెట్ సముదాయంలో కూరగాయల అమ్మకాలు సాగించాలని సూచించారు. మార్కెట్ బయట ఎవరైన కూరగాయల అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దండేపల్లి: బతుకమ్మలతో ఉపాధ్యాయులు



కోటపల్లి కస్తూరిబాలో బతుకమ్మ సంబరాలు



దండేపల్లిలో నెత్తిన బతుకమ్మలతో ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

దండేపల్లి: స్థానిక కేజీబీవీలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఉయల పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పాఠశాల ఎస్వో మంజుల, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి కస్తూర్బాగాంధీ, ఆశ్రమ బాలికల పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘ నంగా నిర్వహించారు. కస్తూర్బాగాంధీ ఎస్వో హరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను ఆర్టీసీ డీఎం జనార్దన్ సన్మానించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఏడీసీలు రాజయ్య, శ్రీనివాస్, డ్రైవర్ కేఎస్‌రావు, కండక్టర్లు రాందాస్, మల్లేశ్‌లను శాలువాలతో సత్కరించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీసీ ద్వారా సన్నరకం ధాన్యం కొనుగోళ్లు



వార్షికోత్సవంలో పాల్గొన్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదో వార్షికోత్సవ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎఫ్‌పీసీ సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు, సహకార బ్యాంక్ మేనేజర్ తిరుపతి, ఎఫ్‌పీసీ డైరెక్టర్స్ పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, చుంచు చిన్నయ్య, బొలిశెట్టి తిరుపతి, పనాస ధర్మయ్య, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేర చరితులు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న రవికుమార్

మందమర్రిరూరల్: నేరచరిత్ర కలిగిన వారు ఇకనుంచి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్కిల్ పరిధిలోని పాత నేరస్తులను పిలిపించి అవగాహన కల్పించారు. సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, సర్కిల్ పరిధి ఎస్సైలు ఉన్నారు.

'అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు'

మందమర్రిరూరల్: మంచిర్యాలకు చెందిన బొంతల వినయ్, శ్రీనివాస్‌లు బెదిరించి తన భర్త రాజేష్‌కు సంబంధించిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని రాజేష్ భార్య కుసుమల ఆరోపించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అప్పుగా ఇచ్చిన డబ్బుకు 20శాతం వడ్డీ వసూలు చేయడంతో పాటు బెదిరించి అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో తీవ్ర కలత చెందిన తన భర్త రాజేష్ నాలుగు రోజుల క్రితం సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, తన భర్త ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ విషయంలో రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస్ జోక్యం చేసుకోవాలని కోరారు.

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

భీమిని: అసంబద్ధమైన సర్దుబాటు ఉత్తర్వులను, ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. కాలం చెల్లిన 2015నాటి రేషనలైజేషన్ నిబంధనలు అమలు చేయడం సరైంది కాదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా యాభై మంది ఉన్న విద్యార్థులకు ముగ్గురిని, వంద వరకు విద్యార్థులు ఉన్న చోట ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు హెచ్‌ఎంను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను, పీఆర్‌సీలను మంజూరు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయలన్నారు. కేజీబీవీ టీచర్లు, సిబ్బందికి కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి మోకెనపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఆరిశాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఏజెంట్ రాముడు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గనిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ఆగస్టు నెలలో ఎక్కువ టబ్బులు నింపినందుకు గాను ఎస్‌డీఎల్ ఆపరేటర్లు పీ.తిరుపతి, మారేపెల్లి సారయ్యలను సోమవారం గనిపై జరిగిన కార్యక్రమంలో ఏజెంట్ రాముడు అభినందించి బహుమతులు అందజజేశారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, గని రక్షణాధికారి సంతోశ్‌రావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

శ్రీరాంపూర్: అవయవదానానికి ముందుకు రావాలని ఆర్కే 7గనుల గ్రూప్ ఏజెంట్ ఎం.రాముడు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆర్కే న్యూటెక్ గనిపై సోమవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం చేయడానికి ముందుకొచ్చిన ఉద్యోగులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్‌లను అందించారు. కార్యక్రమంలో గని మేనేజర్ స్వామిరాజు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, ఫౌండేషన్ అధ్యక్షుడు లింగమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న గని మేనేజర్ తిరుపతి, తదితరులు

శ్రీరాంపూర్: పలు గనులపై రిటైర్డు అయిన ఉద్యోగులను సోమవారం సన్మానించారు. ఆర్కే 6 గనిపై గని మేనేజర్ తిరుపతి, ఆర్కే న్యూటెక్ గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను గని ఏజెంట్ రాముడు, గని మేనేజర్ స్వామిరాజు శాలువాలతో సత్కరించారు. వారికి కంపెనీ నుంచి చెల్లించే టర్మినల్ బెనిఫిట్స్ పే ఆర్డర్స్‌ను అందించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, అధికారులు మర్రి కొముర య్య, రాంనర్సయ్య, శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సురేందర్, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, గని రక్షణాధికారి కొట్టి రమేశ్, సంక్షేమ అధికారి పాల్‌సృజన్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ కొండ కుమారస్వామి, సపోర్ట్‌మెన్ కల్యాణ్ దామోదర్, స్వీపర్ పోచిన్‌లను గని మేనేజర్ భూ శంకరయ్య, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి

- జీఎం సంజీవరెడ్డి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీఎం, ఇతర అధికారులు

శ్రీరాంపూర్: గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ జీఎం బీ. సంజీవరెడ్డి తెలిపారు. ప్రపంచ హార్ట్ దినోత్సవాన్ని సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్కే 8డిస్పెన్సరీలో జరిగిన కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కంపెనీ వైద్యులు గుండె జబ్బులు ఎలా వస్తాయి, వాటిని గుర్తించడం ఎలా, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా గుండె జబ్బులపై అవగాహన కల్పించే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సీఎంవో రమేశ్‌బాబు, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యులు వేద వ్యాస్, లోక్‌నాథ్‌రెడ్డి, మనీషా, పింకీ, ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'కామ్రేడ్ విఠల్‌రావు పోరాట ఫలితంగానే బోనస్'



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఖమ్మం మాజీ ఎంపీ కామ్రేడ్ విఠల్‌రావు పోరాట ఫలితంగానే నేటికీ కార్మికులకు పీఎల్‌ఆర్ బోనస్ అందుతుందన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చెన్నూర్: మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. ఎజెండాలో పొందుపరిచిన 29అంశాలను కౌన్సిల్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ చిట్యాల సతీష్, వైస్ చైరపర్సన్ గెల్లు రజిత, ఆర్‌వో శ్రీనివాస్, ఏఈ మధు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

జన్నారం: ఉద్యోగ కర్తవ్యంలో ఉత్తమ సేవలందించిన వారికి సమాజంలో గుర్తింపు వస్తుందని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జన్నారం మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన చందులాల్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించి సోమవారం ఘనంగా సన్మానించారు.

అథ్లెటిక్స్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన 18మంది విద్యార్థులు జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివరాజం తెలిపారు.

'న్యాయస్థాన తీర్పును తప్పుపట్టడం సరికాదు'

దండేపల్లి: ఎస్సీల్లో వర్గీకరణ చేసుకోవచ్చని, అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినప్పటికీ, దానిని మాల మహానాడు నాయకులు తప్పుపట్టడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. తీర్పును తప్పు పట్టేవారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు.

'పార్టీ నుంచి బహిష్కరించాలి'

చెన్నూర్: శనిగకుంట పేల్చివేత ఘటనలో నిందితులుగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్, రాంలాల్‌గిల్డాలను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులో నిందితులుగా ఉన్న ఇరువురిపై మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు బాల్క సుమన్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐసీటీసీ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐసీటీసీ ఎయిడ్స్ పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్లు మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నాయకులు రెవెల్లి మహేశ్, దొమకొండ అనిల్ తెలిపారు.

ప్రహరీకి భూమిపూజ

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి నాయకపుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీడీవో సరోజ భూమిపూజ చేశారు.

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం

చెన్నూర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. పట్టభద్రులు ఓటరు నమోదు కోసం వివరాలతో కూడిన జాబితాలను స్థానిక మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాలలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటరు నమోదుకు 8 నవంబర్ 2024 వరకు గడువు ఉందని తెలిపారు.

సన్మానం

పాతమంచిర్యాల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డాక్టర్ రమణను సోమవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు.

కంచరబాయిలో పశువైద్యశిబిరం

దండేపల్లి: మండలంలోని కంచరబాయి గిరిజన గ్రామంలో దండేపల్లి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 320మేకలు, 70పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు.

ఎస్సైగా పదోన్నతి

భీమారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న భూమన్నకు ఎస్సై గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూమన్నకు టూ స్టార్‌ని సీపీ తొడిగి ఎస్సైగా పదోన్నతి కల్పించారు.

పండగ పూట పాత బల్బులేంటి?

భీమిని: మండలంలోని మల్లిడి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంలో సోమవారం పాత విద్యుత్ బల్బులు పెట్టడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. మల్లీడిలో కొత్త బల్బులు పెట్టి, అక్కడ తీసి వేసిన బల్బులు మా దుబ్బగూడెంలో ఎందుకు పెట్టిస్తున్నరంటూ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో సోమవారం నిర్వహించిన జోనల్ స్థాయి రెజ్లింగ్, కుస్తీ క్రీడా పోటీలలో పాఠశాలకు చెందిన క్రీడాకారులు భువనేశ్వరి, పావని, హారిక, అనుశ్రీలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు.

వినతిపత్రం అందజేత

భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గల తాత్కాలిక షెల్టర్‌పై ఏర్పాటు చేసిన కవర్లు ధ్వంసం అయ్యాయని, నిలువ నీడ కల్పించాలని మండల కాంగ్రెస్ నాయకులు నరేష్ సోమవారం ఎంపీడీవో మధుసూదన్‌కి వినతిపత్రం అందజేశారు.

రోడ్డుకు మరమ్మతు

వేమనపల్లి: వేమనపల్లి నుంచి ఒడ్డుగూడంకు వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ సూచన మేరకు వేమనపల్లి మాజీ సర్పంచ్ రాంచందర్ సొంత ఖర్చులతో మొరం పోయించారు.

చట్టాలపై అవగాహన

చెన్నూర్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ చెన్నూర్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి రవి సూచించారు. పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కాలేజ్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు.

చెక్కు అందజేత

మందమర్రిరూరల్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సభ్యుడు కుర్మకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా ఆ పార్టీ నాయకత్వం ప్రవేశపెట్టిన పార్టీ బీమా పథకంలో భాగంగా రూ.2లక్షల చెక్కును సోమవారం బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటా అందిస్తున్న బతుకమ్మ చీరలను సోమవారం మంచిర్యాల పట్టణంలోని పలు వార్డుల్లో, హాజీపూర్ మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్, గుడిపేట, నంనూర్, ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లోని మహిళలకు పంపిణీ చేశారు.